# శిశిరవేళ

## పెద్దిభొట్ల సుబ్బరామయ్య

'వాన వచ్చేట్టుంది. ఎక్కడికి ఇప్పుడు?' అంటున్నది వెనకనుంచి కోడలు...

'ఊరికే..అట్లా నాలుగడుగులు వేసివద్దామనీ' అన్నాను.

'గొడుగయినా తీసుకు వెళ్లండి'

నేను వెనుదిరిగి లోపలికి వెళ్లి గొడుగు తీసుకుని బైటికి వచ్చాను.

వీధిలోకి వచ్చి పైకి చూస్తే ఆకాశంలో మబ్బుతునక అయినా లేదు. 'పోనీలెమ్మ'ని చేతిలో గొడుగు ఊపుకుంటూ నడుస్తున్నాను. ఎదురింటి వారి అమ్మాయి-అమ్మణ్ణి-ఎదురై నవ్వుతూ 'తాతగారూ! గొడుగెందుకండీ చేతిలో?' అన్నది



'తాతగారూ' అన్న పిలుపుకు నాకు వొళ్లు మండింది.

'తోవలో వానవొస్తే..మనవరాలా! ఏం చెయ్యాలి?' అన్నాను...

'వానారాదు. పాడూరాదు...తాతగారిదంతా చాదస్తం..' అన్నది మరింతగా నవ్వుతూ

'సరే. దీన్ని తీసుకుపోయి మా యింట్లో పడెయ్యి. నీమాట కాదనడమెందుకు?'అంటూ గొడుగు ఆ పిల్లకు ఇచ్చాను. దాన్ని అందుకుని అమ్మణ్ణి వెళ్లిపోయింది. నేను ముందుకు నడిచాను. వీధి మొదట రోడ్డు అంతా దాదాపు నిర్జనంగా ఉంది. సెలవులు కావడం వల్ల అక్కడ కుర్రకుంకలు చేరి ఉధృతంగా క్రికెట్ ఆడుతున్నారు. నేనక్కడ నిలబడి చూస్తున్నాను. అందులో బౌలింగ్ చేస్తున్న కుర్రవాడు నా వంక చూసి అనవసరంగా నవ్వుతూ, 'వేస్తారా?'అని అడిగాడు. నేను హుషారుగా ముందడుగు వేసి 'ఇవ్వు..వేస్తాను' అని సిద్ధపడ్డాను. వాడు బంతి అందించాడు. నేను చొక్కాచేతులు పైకి మడిచి వెనక్కు పది అడుగులు నడిచి బంతి వేసేందుకు సిద్ధపడ్డాను. బ్యాటింగ్ చేస్తున్నవాడు నిర్లక్ష్యంగా నిలబడి ఉన్నాడు. నేను వేగంగా పరుగెత్తి బంతి విసిరాను. అంతలో అంతటా నవ్వులు..బంతి ఎటో పోయింది. కాని నా భుజం కలుక్కుమని విపరీతమ్మైన నొప్పి పుట్టింది. పక్కన కూలబడి నాకు నేను సపర్యలు చేసుకుంటే రెండు నిమిషాల తర్వాత ఫరవాలేదనిపించింది.

వాళ్లు నా బాధను ఈషణ్మాత్రమూ పట్టించుకోకుండా తమ ఆటకొనసాగించారు.

నేను నీరసంగా లేచి నడిచాను.


'అరవై దాటిన తర్వాత బ్రతకడమే తప్పు' అనుకున్నాను. 'అందరూ అనవసరంగా తాతగారూ, తాతగారూ' అంటారు. అది మొదటి బాధ. ఏమి మాట్లాడినా 'చాదస్తం' అంటారు. ఒక విషయం వాళ్లకు అర్థం కాలేదేమోనని రెండుసార్లు చెబితే

'సుత్తి కొట్టాడు' అంటారు. పాత విషయాలేవైనా గుర్తు చేయబోతే 'చెప్పొచ్చావులే మహా..అంతా పాత సొద' అంటారు. ఏదైనా మాట వినబడక 'ఏమిటీ! మళ్లీ చెప్పు' అన్నట్టు చూశామా, 'చెవిటి మేళం' అంటారు. పాతకాలపు ఆణిముత్యం వంటి సినిమా పేరు ఏదైనా ఎత్తితే 'బోరుబోరు' అంటారు. త్వరగా నాలుగడుగులు వేయబోతే 'నెమ్మది...నెమ్మది! ఏమిటా పరుగు?' అంటారు. నెమ్మదిగి నీరసంగా నడిస్తే 'ఇలా నత్త నడకలు నడిస్తే అయినట్టే' అనీ అంటారు. బట్టతలే అనుకోండి... చివర మిగిలిన నాలుగు పరకలూ చిరాకు పుడితే దువ్వుకుందామని దువ్వెన తీస్తే 'ముసిలాడి షోకులు చూడరా' అన్నట్టు కళ్లతోనే సైగలు చేసుకుంటారు. ఇదంతా పెద్ద వ్యథ...

ఒకప్పుడు నేనూ వయసులో ఉండగా ఇప్పటి వారి కంటే స్పీడుగానే ఉండేవాణ్ణి. నేనెక్కడికయినా వెళ్లవలసి వస్తే మా అమ్మ నాకు సవాలక్ష జాగ్రత్తలు చెప్పి పంపేది. 'ఎవరైనా ఏమైనా అంటే కూడా పట్టించుకోకు. తలవొంచుకో. రైల్లో వెళుతున్నావు. ప్రతి స్టేషనులోనూ ప్లాట్‌ఫారం మీద షికార్లు కొట్టి కదిలే రైల్లో ఎక్కడం గొప్ప అనుకోకు. నీళ్లలో దిగకు. ఎక్కడ నీళ్లు ఎంత లోతుంటాయో ఎవరికీ తెలియదు. నీళ్లలో ఏ జలగలు, పురుగులు ఉంటాయో కూడా ఎవరికీ తెలియదు. అందుకే నీళ్లలో దిగకు..' అంటూ గోలపెట్టేది. ఎప్పుడయినా ఎదురు మాటాడితే 'చెప్పింది వినరా బడుద్దాయి...' అనేది. బడుద్దాయి అంటే అర్థం ఏమిటో అప్పుడు నాకు తెలియలేదు. ఇప్పటికీ తెలియదు. నేనెప్పుడూ ఆమె చెప్పిన జాగ్రత్తలు పాటించనే లేదూ. అయితే నీళ్ల విషయంలో మాత్రం ఆమె చెప్పిన మాటలు పాటించవలసి వచ్చింది. ఇప్పటికీ నాకు నీళ్లను చూసినా ప్రవాహాన్ని చూసినా అమిత భయం. మరీ చిన్నప్పటి నుంచి ఆ నీటి భయం అట్లా మనసులో గూడు కట్టుకుని ఉండిపోయింది. దానికి కారణం ఉంది. దాన్ని ఎప్పటికీ పూర్తిగా మరచిపోనూ లేను. ఎప్పుడో ఊహ తెలియని నాటి దృశ్యం. నా కళ్లముందే నా ఈడు కుర్రవాడు. నా నేస్తం, ఉధృతంగా ప్రవహిస్తున్న కాలువలో పడి నీళ్ల లోపలి ఏదో అదృశ్య భయంకర జలరాక్షసి ఈడ్చుకుపోతున్నట్టు చేతులెత్తి కేకలు పెడుతూ కొట్టుకుపోయాడు. ఆ భీకర దృశ్యం నా మనసులో అచ్చుపడి పోయింది. ఇప్పటికీ నీటి ప్రవాహం అంటే కళ్లు తిరుగుతాయి.

ఇల్లొక జైలు..చిన్నా పెద్దా ఎవరూ నాతో ఎక్కువగా మాట్లాడరు. నేనేదైనా మాట్లాడితే- ఒకటి అంటే తక్కువ- రెండంటే ఎక్కువ. నన్ను ఏ విషయంలోనూ ఎవరూ సంప్రదించరు. అప్పుడప్పుడు విసుక్కుంటూ 'నీకెందుకీ విషయాలన్నీ- ఒకమూలన పడి ఉండక' అని దులిపేస్తారు కూడా.

'కాస్త పచ్చడి వెయ్యి..నంజుకుంటాను' అంటానా? 'తినండి..ఉప్పూ కారాలు..నాకేం? బాధ పడేది మీరు..' అంటుంది కోడలు. నిజానికి ఆమెకు నా ఆరోగ్యం ప్రధానమని నేననుకోను. నన్ను మాటలతో బాధ పెట్టడం ఆమె నైజం. కొడుకు వెధవ కూడా ఆమెనే సమర్థిస్తాడు. 'ఏం? కారం తగ్గితే ముద్ద దిగదా?' అంటాడు. 'కాఫీ చేదు..కాస్త పంచదార వెయ్యి' అంటానా? ఇక చచ్చానే. క్లాసు పీకుతారు అందరూ చేరి. పీకిపాకాన పెడతారు.



అందుకే నేనొక చిట్కా కనిపెట్టాను. ఎవరికీ తెలియనది కాదనుకోండి..

సాయం వేళ 'అట్లా నాలుగడుగులు వేసి వొస్తాను. కాస్సేపయినా నడవకపోతే బి.పి. షుగరు కంట్రోలు కావు! అని చెప్పి బయలుదేరడం..

సిటీ బస్సెక్కి వన్నవుల్లో దిగడం. అక్కడి పాత కాలపు చిన్న హోటల్లో ఒకమూలగా సెటిల్ కావడం..ముందు ఒక స్వీటు..ఆ తర్వాత మస్తుగా జీలకర్ర,అల్లం, మిర్చితో ఒక పెసరట్టు లాగించడం. పుష్కలంగా చక్కెర వేయించుకుని కాఫీ తాగడం.. తర్వాత ఏమీ ఎరగనట్టు ఇంటికి చేరుకోవడం...దీన్తో ప్రాణానికి హాయిగా ఉంటున్నది. గొప్ప త్రిల్‌గా కూడా ఉంటున్నది.

ఇవాళ గొడుగు ఆ పిల్ల చేతికి ఇచ్చి బయలుదేరానా? చేతులూపుకుంటూ బస్టాపు దగ్గరికి వచ్చేసరికి బస్సు కంటే ముందు ఆకాశంలో దండయాత్రకు సిద్ధమైనట్లు గర్జిస్తూ భీకరంగా మేఘాలు గుమికూడాయి.

బస్సులో ఎక్కగానే ఒక అపరత్యాగ(ధనుడు) రాజు 'తాతగారూ! కూర్చోండి. అని తాను లేచి నాకు సీటు ఆఫరు చేశాడు. వాడి వంక కృతజ్ఞతాపూర్వకంగా కాకుండా గుడ్లురిమి కోపంగా చూస్తూ కూర్చున్నాను. అప్పుడే జల్లు మొదలయింది. వన్నవుల్లో బస్సు దిగక తప్పదు కదా! నిలువెల్ల తడవకనూ తప్పలేదు. హోటల్లో నిలువెల్లా నీరుకారుతూ ఒక మూల కూలబడ్డాను. ఆ అల్లరి పిల్ల చెబితే మటుకు నా బుద్ధి ఏమయింది? గొడుకు ఎందుకు ఇచ్చేయాలి? అదేమి బరువైన వస్తువా? ఉంచుకుంటే సరిపోయేది. ఒక స్వీటు ఆర్డరిచ్చి ఎదురు చూస్తూ కూర్చున్నాను. స్వీటు రాగానే ఆ ప్లేటు ముందుకు లాక్కోబోతూ ఉండగా మబ్బు లేని పిడుగొకటి పడ్డటయింది. 'నాన్నా! ఎందుకిలా వొచ్చావు? ఇక్కడేం పని పడింది నీకు?' అంటూ మా వాడు తన సహోద్యోగుల గుంపుతో వచ్చి పడ్డాడు. 'నువ్వెందుకు ఈ టైములో ఆఫీసు నుంచి వొచ్చావు..?' అని నేను ఎదురు ప్రశ్న వేశాను. ఆ గుంపులో ఒక బడుద్దాయి గాడి పుట్టిన రోజట నా ఖర్మకాలి. స్వీటు చేతికందేంత దూరంలో నోరూరిస్తున్నది. కాని ఏం లాభం? పెద్దగా 'సర్వర్! ఒక కాఫీ షుగర్‌లెస్' అని అరిచాను. ఆ పుట్టిన రోజు పార్టీ మొదలు కానే లేదు. ఎప్పటికి పూర్తవుతుందో!

మనసు విరిగిపోయింది. నిట్టూర్చి లేచాను. విసవిసనడిచి ఇవతలికి వచ్చాను.

'జీవితం ఇంతే..' అని నన్ను నేను తిట్టుకుంటూ బైటికి వచ్చి నడవటం మొదలుపెట్టాను.

మాటిమాటికీ 'ఈ జీవితం ఇంతే'అని అష్టోత్తర శతంలాగా మనసులో అనుకున్నాను.

మళ్లీ బస్సెక్కి ఇంటి ముందుకు వచ్చి ఆగాను. ఎదురింటి అమ్మడు-అమ్మణ్ణి-తమ అరుగు మీద హాయిగా కూర్చుని ఉండి ఏదో స్వీటు కాబోలు తింటూ నవ్వుతూ 'వానలో బాగా తడిసినట్టున్నారే తాతగారూ..' అన్నది. నాకు వొళ్లు మండింది. 'తడిశారా?' అన్నందుకు కాదు..మళ్లీ 'తాతగారూ' అన్నందుకు...

◆